క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట : నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దత్త సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత దంత చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యనగర్లలోని సాయిదత్త దంత వైద్యశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు శిబిరం ఉంటుందన్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టూత్‌పేస్ట్ ఉచితంగా అందజేస్తామన్నారు. సెల్.92463 66944

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

ముషీరాబాద్: నల్లకుంట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జగదీష్‌ను అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లలితానగర్‌కాలనీలో సీసీ కెమెరాలు, శాంతిభద్రతలు విషయంపై పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు అబ్రహం, కార్తీక్, ప్రసాద్‌రెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్, ధర్మరాజు తదితరులున్నారు.

పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న రావులపాటి మోజెస్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్ మాదీనామజీద్‌లో తాగునీటి నల్లా కనెక్షన్ పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ వెల్లడించారు. గతవారం ఎమ్మెల్యేను కలవడంతో ఆయన చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. ముదిగొండ మురళి, ప్రవీణ్‌ముదిరాజ్, మొయిజ్, అన్వర్ తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ శాస్త్రీనగర్, జెమినీ కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు బస్తీవాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కేశవపురం అరుణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పర్యటించారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, సుదర్శన్‌గౌడ్, రాజుగౌడ్, జ్ఞానేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, వాసుగౌడ్, లక్ష్మణ్, భాస్కర్, సత్యనారాయణ, కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

అరవింద్‌కు ఘన నివాళి

చిక్కడపల్లి: అరవింద్ గ్రంథాలయ సేవలు విలువైనవని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి అన్నారు. గ్రంథాలయ పూర్వ గంథపాలకుడు అరవింద్ సంస్మరణసభ సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా అరవింద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అరవింద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని గ్రంథాలను ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘాల టీఎన్‌జీఓ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు అయోధ్య, శేఖర్‌గుప్తా, ప్రతిభారెడ్డి, కుటుంబసభ్యులు వేదకళ, దివ్య, అజాయ్ కుమార్, ఎం.కావ్య తదితరులున్నారు.

పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నరేష్, సిబ్బంది

చిక్కడపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ నరేష్ పర్యవేక్షణలో స్టేషన్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని పలుచోట్ల వాహనాలతో పాటు హోటళ్లు, లాడ్జిలు, హాస్టళ్లు, ప్రైవేట్ సంస్థలు, సినిమా థియేటర్లు, ఫ్యాక్టరీలు, కంపెనీల్లో సోదాలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ నరేష్ వివరించారు. ఎస్సైలు నాగరాజు, అభిలాష్, యశ్‌పాల్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా



జైస్వాల్‌గార్డెన్‌లో తిరంగా జెండా కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమం ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి డీడీ కాలనీలో తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, పలువురు నేతలు వారి ఇళ్లపై జెండా ఎగురవేసి వందనం చేశారు.

చిక్కడపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయజెండాలు ఎగురవేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సూచించారు. సోమవారం జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జాతీయజెండాలను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు దేశ



విద్యార్థులకు జెండాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలన్నారు. బీజేపీనేత ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయి చంద్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, సురేందర్, నవీన్‌కుమార్, ప్రకాష్‌యాదవ్, పాఠశాల ప్రదానోపాధ్యాయులు స్వర్ణలత, నర్సమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

నిత్యజనగణమనతో జాతీయభావం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట శివానంద్‌నగర్‌లోని నిత్య జనగణమన కేంద్రంలో గత 465 రోజులుగా నిత్యం జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం తనకేంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం నల్లకుంట శివానందనగర్‌లో జెండా వందనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నిత్య జనగణమన ద్వారా ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందింపజేస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇండియన్ స్కూల్ అకాడమీ విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌గౌడ్, అనంతుల అనిల్, భరత్, అశోక్, జూకంటి ప్రశాంత్ దుబె, సైదులు, నిర్వాహకులు మధు, ప్రజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివిధ వేషధారణలో చిన్నారులు..



వివిధ దేశనాయకుల వేషధారణలో చిన్నారులు

ముషీరాబాద్: కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం చిన్నారులు ప్రత్యేక దుస్తులతో అలంకరించుకుని ఆకర్షణగా నిలిచారు. చిన్నారులతో పాటు తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ భారతీయుడు జాతీయజెండాను ఎగురవేయాలి..

కాచిగూడ: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ జాతీయజెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకురాలు కె.గీతామూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ జెండాను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రతీ ఒక్క భారతీయుడు దేశం పట్ల నిబద్ధత, నిజాయితీ, దేశభక్తి కల్గి ఉండాలన్నారు. వై.అమృత, ఉమారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కె.గీతామూర్తి

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..!



చెప్పల్‌బజార్‌లో వరదనీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్‌లో రూ.15 లక్షలతో చేపట్టనున్న వరదనీటి పైపులైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దిడ్డి రాంబాబు, డాక్టర్ బద్దుల శిరీష, డాక్టర్ ఓం ప్రకాష్‌యాదవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునీల్‌బిడ్లాన్, కృష్ణగౌడ్, శేషు, మహేష్, ఆంటో, బబ్లూసింగ్, బీజేపీ నేతలు బీమ్‌రాజ్, సుభాష్‌పటేల్, రవియాదవ్, మల్లికార్జున్, ప్రతిభ, బల్వీర్, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకోసం ప్రత్యేక చర్యలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రతకోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి లంబాడి తాండబస్తీలోని డబుల్ బెడ్రూం వాసులకు సోమవారం యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహతో కలిసి కెమెరాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల నేరాలను అదుపు చేయడానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి కాలనీ, బస్తీ కమిటీల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకారం అందించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీ, బస్తీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, రమేష్‌రెడ్డి, బస్తీ అధ్యక్షుడు కళ్యాణ్, దేవేందర్‌నాయక్, మోబా, మున్నా, కిషన్, హరి, ఝాన్సీరామ్, ఉపేందర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్: 18 ఏళ్ల వయసు నిండిన యువత అందరూ తమ పేర్లను ఓటరుగా నమోదు చేయించుకోవాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వాణినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు ద్వారా మనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకొని సుపరిపాలన సాధించుకోవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీ, ఎన్నికల కమిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించిన కోట్ల శ్రీనివాస్

గిరిజనుల ఐక్యతకు ప్రతీక తీజ్ వేడుకలు



సైదాబాద్: తీజ్ వేడుకలు గిరిజనుల ఐక్యతను చాటుతాయని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజనలు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. మహిళలు మొక్కల బుట్టలను నెత్తిన పెట్టుకొని సరూర్ నగర్ చెరువు వరకు ఊరేగింపుగా సాగారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వనాలు పెంచేందుకు మొక్కలు నాటాలి



శివంరోడ్డు ఏటీఐ కేంద్రంలో మొక్కలు నాటుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అమృత్ వనాలు పెంచాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం శివంరోడ్డులోని ఏటీఐ కేంద్రంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రతి పల్లె నుంచి పట్టణం, ఢిల్లీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు పెంచి పచ్చదనానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు శ్యామ్‌రాజ్, కృష్ణగౌడ్, నాగభూషణం చారి, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

మణిపూర్ బాధితులకు ఆర్థికసాయం

ముషీరాబాద్: గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని ఎంవీ చర్చి తరఫున మణిపూర్ బాధితులకు రూ.1,09,577లను విరాళంగా సోమవారం మణిపూర్ వాసులకు అందజేశారు. చర్చి కోశాధికారి ఎస్.కే.జాన్‌కెనడీ, సెక్రటరీ శ్యామ్‌ప్రసాద్‌రావు, జ్ఞాన్‌సుందర్, విజయ్‌పాల్, రిక్సన్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలి



కవులతో జయరాములు, వైఎస్ఆర్‌మూర్తి

చిక్కడపల్లి: సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలని విశ్వసాహితి అధ్యక్షుడు, ప్రముఖ రచయిత డాక్టర్ బి.రాములు అన్నారు. వైఎస్ఆర్‌మూర్తి చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని సంస్థల కార్యాలయంలో 'పరవశించిన నా జన్మభూమి' పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. వైఎస్ఆర్‌మూర్తి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్ఆర్‌మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో బహుమతులు ప్రదానం చేశారు. దేశాభివృద్ధిలో కవులు, రచయితలు భాగస్తులు కావాలని తమ రచనలతో దేశాభివృద్ధికి సహకరించాలని జయరాములు అన్నారు. ఆర్థిక శాస్త్రవేత్త మేజర్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, ప్రముఖ వర్ధమాన కవులు శైలజామిత్ర, సోమయాజులు, లక్ష్మి, రఘురామమూర్తి, కల్యాణి, రామ్‌కిషన్, ఆంజనేయులు, విజయలక్ష్మి, ఉషారాణి, శ్రీదేవి, రామాగౌడ్, షహనాఖాన్ పాల్గొన్నారు.

రూ.10.70లక్షలతో సీసీరోడ్డు పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో రూ.10.70లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

గంట ముందుగానే శంకుస్థాపన చేశారని ఆగ్రహం



ఆందోళన చేస్తున్న ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌ల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతూనే ఉంది. సోమవారం ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్ సరిహద్దుల మధ్య రూ.19 లక్షలతో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పనుల సందర్భంగా వీరి మధ్య ప్రొటోకాల్ రగడ మరోసారి బహిర్గతమైంది. సెయింట్ పాయిస్ స్కూల్ నుంచి పార్శిగుట్ట మార్గం మీదుగా రాంనగర్ ప్రధాన రహదారి వరకు ఏర్పాటు చేస్తున్న కొత్త డ్రైనేజీ పైపులైన్ పనులకు, బ్రహ్మంగారి దేవాలయం ప్రధాన ద్వారం నుంచి రామాలయం వరకు మరో పైపులైన్ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతా ప్రకాష్‌గౌడ్, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు పనులను ప్రారంభించి వెళ్లిపోయారు. అనంతరం కార్పొరేటర్ సుప్రీయనవీన్‌గౌడ్ దంపతులు పరిస్థితిని చూసి అవాక్కైయ్యారు. అధికారులు, ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తన అనుచరులతో కలిసి జలమండలి కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు.

పైపులైన్‌లు లేకుండానే పనుల ప్రారంభమా..?

'తమకు అధికారులు సాయంత్రం 4గంటలకు ప్రారంభం అని చెప్పి 3 గంటలకే శంకుస్థాపన చేసి వెళ్లిపోవడం ఏమిటని' ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ప్రశ్నించారు. పైపులైన్ పనులు లేకుండా ఇనాగిరేషన్ ఏమిటని ఆమె ప్రశ్నించారు. జూన్ 24 నుంచి నేటి వరకు జలమండలి కార్యాలయాల చుట్టూ తిరిగి డివిజన్‌లోని నాలుగు డ్రైనేజీ పైపులైన్ పనులను జనరల్ బడ్జెట్ కింద నిధులు మంజూరు కాగానే ఈ విషయం తెలుసుకుని ఎమ్మెల్యే హడావిడిగా పనులను ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకోకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

భారత్ బచావో ముగింపు సభ



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.ఎఫ్.గోపినాథ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత్ బచావో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు ముగిశాయి. సోమవారం ఈ ముగింపు సభలో జాతీయ కౌన్సిల్ వైస్ చైర్మన్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎఫ్.గోపినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టినప్పటికీ ప్రతిపక్షాలను తిట్టడమే తప్పా.. మణిపూర్ గురించి మాట్లాడలేదని' విమర్శించారు. దేశంలో అదుపు తప్పే పరిస్థితులు రాబోతున్నాయని, వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీలన్నీ ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. దేశంలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ బచావో రాష్ట్ర నాయకులు గాదె ఎల్లయ్య, మార్క శంకర్‌నారాయణ, అజయ్‌సింగ్ రాథోడ్, రేఖాచంద్రశేఖర్‌రావు, అరుణజ్యోతి, ఇబ్రహీం తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభిప్రాయపడ్డారు. సోమవారం సాగర సంఘం అధ్యక్షుడు ఎస్.యాదయ్యసాగర్, వెంకటరావు సాగర్‌ల ఆధ్వర్యంలో 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎ.పర్వతాలు, వెంకట్, పి.దశరథ్, సత్యనారాయణ, చంద్రమోహన్, పార్టీ సీనియర్ నేతలు గెలవయ్య, కాసం శ్రీహరి, జమ్మిచెట్టు బాలరాజ్ తదితరులున్నారు.